నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 23 ఆగస్టు 2023

నిజాంసాగర్‌కు జూనియర్ కాలేజీ మంజూరు

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలానికి జూనియర్ కళాశాల మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మండల ప్రజలు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండలానికి జూనియర్ కళాశాల మంజూరు చేయడంలో కృషిచేసిన జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మండలానికి ప్రతి ఒక్క ఊరు నుండి బస్సు సౌకర్యం కూడా కల్పించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు. బస్సు సౌకర్యం లేక ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు అనేక వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తుందని, బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేత


ఎల్‌వోసీ చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలోని 12వ వార్డుకు చెందిన పి కృష్ణయ్య ఆసుపత్రిలో చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ ను సంప్రదించగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే లక్ష రూపాయలు ఎల్ ఓ సి చెక్కును మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ ద్వారా మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు నీలకంఠం, రాము, ఆదిమూలం సతీష్, నాయిని సాయి రాములు, తిరుపతి, సతీష్ , సత్తయ్య, న్యాయవాది సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేసి చూపిస్తా

- మరోసారి ఆశీర్వదించండి : మంత్రి వేముల
- టికెట్ రావడంతో మంత్రికి ఘనస్వాగతం పలికిన నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/మోర్తాడ్/వేల్పూర్/బాల్కొండ

బాల్కొండ నియోజకవర్గాన్ని ప్రజలు తలెత్తుకొని గర్వంగా చెప్పుకునేలా మరింత అభివద్ధి చేసి చూపిస్తానని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కేసిఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా రికార్డ్ సష్టించనున్నారని తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో మరోసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు. బాల్కొండ నియోజకవర్గం ఎమ్మెల్యేగా టికెట్ ప్రకటించిన తర్వాత మొదటి సారి నియోజకవర్గానికి వచ్చిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి నియోజకవర్గ బిఆర్ఎస్ శ్రేణులు గజమాలతో అఖండ స్వాగతం పలికారు. పెర్కిట్ - లక్కోరా - వేల్పూర్ - భీంగల్ - కమ్మరపల్లి - మోర్తాడ్ మీదుగా దారి పొడవునా అడుగడుగునా అభిమానులు పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూర్ ఎక్స్ రోడ్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి, రైతు నాయకుడు క్రీస్తు శేషులు వేముల సురేందర్ రెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.


మంత్రి వేములకు గజమాలతో స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఈ సందర్భంగా కమ్మర్ పల్లి లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజు ప్రజల నిరాజనం చూస్తుంటే కేసీఆర్ పై, నాపై ప్రజలకు ఉన్న నమ్మకం ఏంటో అర్థమవుతుందని పేర్కొన్నారు. డబ్బుతో ఈ ప్రేమను కొనలేమని, కేసిఆర్ ఒక్కరు ఒకవైపు, బిజెపి కాంగ్రెస్ ఇతర దుష్టశక్తులు మరోవైపు ఉండి ఎవరిని ప్రయత్నాలు చేసినా ఈసారి కూడా మాదే ఘన విజయం స్పష్టం చేశారు. రూ.19వేల కోట్లతో రుణమాఫీ చేసిన దమ్మున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అని, మ్యానిఫెస్టోలో లేని ఎన్నో పథకాలను అమలు చేశారన్నారు. అందుకే కేసిఆర్ పై ప్రజలకు ప్రగాఢ విశ్వాసం ఉందన్నారు. ఇక ఈ మధ్యన ఓటమి భయంతో నాపై కొంతమంది దష్ప్రచారం చేస్తున్నారని, ప్రతిపక్షాలు చిల్లర ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. వేల కోట్ల నిధులతో నియోజక వర్గాన్ని అభివద్ధి చేశానని, ప్రజల ఆశీర్వాదంతో ఈ అభివద్ధిని కొనసాగిస్తానన్నారు. అపూర్వ స్వాగతం పలికిన నియోజకవర్గ ప్రజలకు, బిఆర్ఎస్ కుటుంబ సభ్యులకు మంత్రి ప్రశాంత్ రెడ్డి హదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


రోడ్డు సేఫ్టీ పరికరాల ఏర్పాటు పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజల భద్రత పోలీస్ శాఖ ధ్యేయం అని అదనపు పోలీస్ డిప్యూటీ కమిషనర్ లా అండ్ ఆర్డర్ జయరామ్ తెలిపారు. మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలో ఎక్కడెక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయ్యే ప్రత్యేక అధ్యాయనం నిర్వహించారని, ఇందులో భాగంగా గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను, ఘణాంకాల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించినట్టు తెలిపారు. జాతీయ స్థాయి రోడ్లు, రాష్ట్ర స్థాయి రోడ్లు మొదలగు ప్రాంతాల లో చిన్న రోడ్ల వలన, కల్వర్టుల వలన, వర్షానికి రోడ్లు పాడవడం వలన, ఇరుకు రోడ్లు, ప్రధాన జంక్షన్లు . ప్రమాదాలు జరిగే చోట రోడ్డు ప్రమాదాలు జరుగునని హెచ్చరించే బోర్డులు లేకపోవడం వలన మొదలగు విధాలుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలుసుకున్నారు. ప్రధానంగా టౌన్ 5 పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్ని-బాన్సువాడ వెళ్లే రహదారిలో మరియు టౌన్ 6 పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపూర్-జాన్కంపేట్- బోధన్ వెళ్లే రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో స్టడీ చేసి రోడ్డు ప్రమాదాల నివారణకోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, అదనపు పోలీస్ కమీషనర్ లా అండ్ ఆర్డర్ జయరాం ప్రజలకు పలు సూచనలను తెలియజేశారు.

ట్యాంకర్‌ను రిపేర్ చేయించండి


ట్యాంకర్‌ను పంచాయతీ ఎదుట నిలిపిన సభ్యులు

నవతెలంగాణ-బిచ్కుంద

గ్రామస్తుల దాహర్తి తీర్చడానికి తాము గ్రామపంచాయతీకి ఇచ్చిన ట్యాంకర్.. రిపేర్ చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని బిచ్కుంద మండల కేంద్రంలోని భూమి స్వచ్ఛంద సేవసంస్థ ఆధ్వర్యంలో జీపీ కార్యదర్శి హనుమంతురావ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామస్తుల దాహర్తి తీర్చడానికి సభ్యుల సొంత డబ్బులతో 2020లో ట్యాంకర్ కొనుగోలు చేసి ప్రజలకు నీటిని సరఫరా చేపట్టారు. గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడడంతో గ్రామపంచాయతీ పాలకుల అభ్యర్థన మేరకు 2021-22లో గ్రామపంచాయతీకి నీటి ట్యాంకర్‌ను అప్పజెప్పారు. పాలకుల అశ్రద్ధ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల రెండు సార్లు ట్యాంకర్ బోర్లా పడి చెడిపోయిందని గత సంవత్సరం నుండి సర్పంచ్, ఉపసర్పంచ్ కు వార్డ్ మెంబర్లకు గ్రామ కార్యదర్శికి ట్యాంకర్ మరమ్మత్తుల కోసం విన్నవించగా పట్టించుకోకుండా అశ్రద్ధ చేస్తూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. నీటి ట్యాంకర్ ను గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఉంచి మరమ్మతులు చేయించాలని విన్నవించారు.

స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మర్కల్) కామారెడ్డిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డా. వి. రాధిక, అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ ఏ. పూర్ణిమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ.కామ్, బీఎస్సీ, బీఏలో సీట్లు భర్తీకి ఎస్సీ కేటగిరిలో ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి అయిన ఎస్సీ విద్యార్థినులు కళాశాల కు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులు రెగ్యులరైజ్ చేయాలి


మాట్లాడుతున్న నారాయణగుప్త

నవతెలంగాణ-భిక్కనూర్

తెలంగాణ విశ్వవిద్యాలయ దక్షిణ ప్రాంగణంలో 12 విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెలైజ్ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్న సౌత్ క్యాంపస్ లో కాంట్రాక్ట్ అధ్యాపకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ గుప్త మాట్లాడుతూ 90 రోజుల నుండి నిరసన తెలుపుతున్న ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదని, గతంలో హామీ ఇచ్చిన విధంగా రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు యాలాద్రి, సునీత, రమాదేవి, నరసయ్య, వైశాలి, నిరంజన్ శర్మ, శ్రీకాంత్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కేశ్‌పల్లి గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ పల్లె పల్లెకూ భూపతిరెడ్డి కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి ముందుకు సాగారు. అనంతరం గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయం అందిచాలని కోరారు. ప్రజలకు సంక్షేమ పథకాలపై క్షుణ్ణంగా వివరించారు. బీఆర్ఎస్, బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. లింబాద్రి, నరేందర్, ప్రేమ్‌కుమార్, ఆకాష్, నాగవంశీ, అనిల్, నితిన్, మధు, రాజు, వంశీకృష్ణ, నిఖిల్, పరమేష్, రూపేష్, రోహిత్, రాహుల్, బిన్ను, ప్రజ్వల్, చోటు, వంశీ, వేణు, స్టెఫెన్, బాలు, వర్ధన్, నివాస్ గౌడ్, పర్వేజ్, అక్లేష్ తదితరులు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిన్నరెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు సొప్పరి వినోద్, మండల ప్రధాన కార్యదర్శి వసంత రావు, మండల యూత్ ఉపాధ్యక్షులు మున్నూరు ప్రణయ్ కుమార్, జనరల్ సెక్రటరీ లక్ష్మణ్, ఎస్ఎస్ రూరల్ ప్రెసిడెంట్ అభిలాష, మైనార్టీ అధ్యక్షులు అక్బర్, గన్య తండ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుడిగా నా పని చేశా.. తీర్పు మీ చేతిలో ఉంది

- నియోజకవర్గం లో 225 గ్రామాలకు అడిగింది ఇచ్చా
- కాంగ్రెస్, బీజేపీ ఎప్పుడు కనబడలేదు
- మరోసారి అధికారం ఇస్తే ఇంకా చేస్తా : స్పీకర్


జనరల్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గంలో ఉన్న 225 గ్రామాలకు అడిగిన ప్రతి పనిని 100 శాతం చేశానని మరోసారి ఆదరిస్తే అభివృద్ధి చేస్తా అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్ని మండలం కేంద్రంలో 50 లక్షల రూపాయలు తో నిర్మాణం చేసిన జనరల్ పంక్షన్ హాల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గంలో పేదలు తక్కువ ఖర్చుతో శుభకార్యాలు చేసుకోవడానికి 100 జనరల్ ఫంక్షన్ హాల్స్ నిర్మించామని అన్నారు. ఎవరైతే పంక్షన్ చేసుకుంటారో వారు కిరాయి కేవలం 5000 రూపాయలు మాత్రమే చెల్లిస్తే కిరాయి డబ్బులతో కరెంట్ బిల్లు, నీటి సరఫరా, వాచ్ మెన్, క్లీనింగ్ వంటి నిర్వాహనకు వాడుకుంటారని తెలిపారు. వంట సామాను, టెంట్ సామాను కూడా ఉచితంగా అందుబాటులో ఉంటుందన్నారు. కులమతాలకు, రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా ఎవరైనా ఈ ఫంక్షన్ హాల్ లలో శుభకార్యాలు జరుపుకోవచ్చు అని చూచిచాంచారు.

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దొంగలు దొంగలు కలిసి ఊళ్ళు పంచుకున్నట్లు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో లక్షలు, కోట్లు మింగి వేశారని ఓట్ల కోసం వస్తే నిలదీయండి అని తెలిపారు. నేను ఇచ్చాను, ఓట్ల కోసం వస్తాను అని అన్నారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టేది మరో పార్టీ బి జె పి. పేదలకు రాష్ట్రానికి ప్రధాని చేసింది ఏమి లేదు,కానీ ప్రధానమంత్రి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతారు ఆ మాటలు మనం చెప్పలేం అని అన్నారు. చేసిందే చెపుతున్న ప్రజలకు తెలుసు వారే తీర్పు ఇస్తారని అన్నారు. కార్యక్రమం లో నియోజకవర్గం ఇంచార్జి సురేందర్ రెడ్డి, జడ్పీటీసీ హరిదాస్, ఉప సర్పంచ్ కంది కష్ణ, ఏ ఎం సి వైస్ చైర్మన్ గోపాల్, మండల అధ్యక్షులు గిరి, వైస్ ఎంపీపీ దండ్ల బాలరాజు, సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు సత్తిబాబు, శ్రీనగర్ రాజు, వెంకన్న, పద్మ జగ్రామ్, కో అప్షన్ ఖరీం, సీనియర్ నాయకులు మేక విరాజ్, కోర్వ గణేష్, భూషణం, ఎంపీడీఓ బశిరోద్దీన్, తహసీల్దార్ విఠల్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తూ మరింత ఉన్నతశిఖరాలు చేరాలి

- కలెక్టర్ జితేశ్ వి పాటిల్
- గ్రామాల అభివృద్ధిలో జేపీఎస్‌ల కీలకపాత్ర
- నియామకపత్రాలు అందజేసిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/నిజాంసాగర్


రెగ్యులరైజ్ చేస్తూ అందజేసిన నియామకపత్రాలతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిజాయితీగా కష్టపడి ఇంకా పై స్థాయికి ఎదగాలని కలెక్టర్ జి వితేష్ పాటిల్ అన్నారు. జేపీఎస్ నుండి గ్రూప్ 4 కార్యదర్శులుగా పదోన్నతి పొందిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో మంగళవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 115 మందికి గ్రూప్ 4 కార్యదర్శులుగా రెగ్యులరైజ్ చేస్తూ ఎమ్మెల్యే జాజల సురేందర్, కలెక్టర్ జి వితేష్ పాటిల్ నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే జాజల సురేందర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులది కీలక పాత్ర అని అన్నారు. జెపిఎస్‌ల కృషి వల్లే తెలంగాణ గ్రామాలకు కేంద్రం ఎన్నో అవార్డులను ఇచ్చిందని, ఈ రోజు గ్రామాల్లో క్రీడా మైదానం, వైకుంఠ ధామం, కంపోస్ట్ షెడ్ వంటి ప్రభుత్వ పథకాల్లో జేపీఎస్‌ల పాత్ర కీలకమైంది అని అన్నారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందినా 115 మంది జేపీఎస్ లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జడ్పీటీసీ ఉష గౌడ్, ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్, ఆర్డీవో ప్రభాకర్, డిపిఓ శ్రీనివాస్ రావు, ఎల్లారెడ్డి డిఎల్పీఓ సుధాకర్, కామారెడ్డి డి ఎల్పీఓ సాయిబాబా, ఎల్లారెడ్డి ఎంపిఓ ప్రకాష్, ఎంపీడీఓ రవీందర్,నాగిరెడ్డిపేట్ ఎంపిఓ శ్రీనివాస్, లింగంపేట్ ఎంపిఓ ప్రభాకర్, గాంధారి ఎంపీఓ రాజ్ కిరణ్, ఆయా గ్రామాల బిఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

17 మంది జేపీఎస్‌లు రెగ్యులరైజేషన్

నిజాంసాగర్ : నిజాంసాగర్ మండలంలోని 17 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొఫెషన్ పిరియడ్ ముగిసినందున వారికీ రెగ్యులరైజేషన్ అయిందని ఎంపీడీవో నాగేశ్వర్ తెలిపారు. వీరికి మంగళవారం ఎమ్మెల్యే హనుమంత్ షిండే చేతుల మీదుగా ఆర్డర్ కాపీలను అందజేసినట్టు తెలిపారు. దీనికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అందరు కూడా హర్షం వ్యక్తం చేశారు.

కామారెడ్డిలో కేసీఆర్ ఓటమి ఖాయం

నవతెలంగాణ-భిక్కనూర్


నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డిలో కేసీఆర్ ఓటమి ఖాయమని కాంగ్రెస్ పార్టీ టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలం కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గజ్వేల్ లో పోటీ చేస్తే ఓడిపోతానని ఓటమి భయంతోనే కెసిఆర్ కామారెడ్డి, గజ్వేల్‌లో రెండు చోట్ల పోటీ చేస్తున్నారని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాయ మాటలు చెప్పి పబ్బం గడిపే కెసిఆర్ ను, బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేయడానికి కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టి పార్టీలో చేర్చుకోవడానికి బీఆర్ఎస్ పార్టీ భయభ్రాంతులకు గురిచేస్తూ పార్టీలో చేరడానికి ఆశ చూపిస్తారని, ఎలాంటి ప్రలోభాలకు, హెచ్చరికలకు భయపడకుండ కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. తిరగబడతాం తరిమికొడదాం అనే వినాదంతో ప్రతి ఒక్క కార్యకర్త నడుంబిగించి షబ్బీర్ అలీని కామారెడ్డిలో భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, కంచర్ల ఎంపిటిసి మోహన్ రెడ్డి, ఎస్.ఆర్.ఐ సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు సిద్ధ గౌడ్, లింగారెడ్డి, సురేష్, లింబాద్రి, ఆంజనేయులు, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ ఆస్పత్రి పై చర్యలు తీసుకోవాలి

- డీఎంఅండ్‌హెచ్‌వోకు బాధితుల ఫిర్యాదు


వినతిపత్రం అందజేస్తున్న బాధితుడు తిరుపతి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లైఫ్ ఆసుపత్రి పై చర్యలు తీసుకోవాలని మంగళవారం నవ తెలంగాణ రామారెడ్డి విలేకరి తిరుపతి డి ఎం అండ్ హెచ్ ఓ లక్ష్మణ్ సింగ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. గత ఏప్రిల్ 18వ తేదీన పొలం దగ్గర ప్రమాదవశాత్తు జారి పడగా, లైఫ్ ఆస్పత్రిలో చేరగా, మనికట్టు వద్ద విరిగిందని, మోచేతిలో కీలు తప్పిందని వైద్యం చేయగా, మూడు నెలలు అవుతున్న చేయి నొప్పి తగ్గకపోవడంతో పాటు చేతు కదలికలు రాలేకపోయాయని తెలిపారు. అనుమానంతో హైదరాబాదులోని కిమ్స్ ఆస్పత్రిలో వైద్యుని సంప్రదించగా, మోచేతిలో విరిగిన ఎముకలను తొలగించకపోవడంతో సమస్య ఉందని, మళ్లీ శస్త్ర చికిత్స నిర్వహించారని తెలిపారు. లైఫ్ ఆస్పత్రిలో చేసిన వైద్యులు శివ పేరు మీద డిశ్చార్జి సమ్మరీ అందజేశారని, వైద్యం చేసినప్పుడు శివ ఎవరో తెలియదని, అర్హత లేనివారు సర్జరీ చేయడం, వైద్య సేవలు చేయటం ఆస్పత్రిలో చేస్తున్నారని, దీంతో రోగులకు నయం కాకపోగా.. మరింత ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. ఆస్పత్రి పై, వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి లైఫ్ ఆసుపత్రి, ప్రజల జీవితాలతో ఆడుకుంటుందని ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు.

రామారెడ్డి మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన పోతుల కష్టారెడ్డి 2022 ఏప్రిల్ 20న కాలు విరగడంతో చికిత్స నిమిత్తం లైఫ్ ఆస్పత్రికి వెళ్లగా.. రామ్ మనోహర్ పేరు పై డిశ్చార్జి సమ్మరీ ఇచ్చారని, ఇప్పటివరకు ఆయన ఎవరో తెలియదని, ఆస్పత్రిలో అర్హత లేని వ్యక్తులు రాత్రిపూట సర్జరీ చేస్తున్నారని, అందు కారణంగా సంవత్సరం పూర్తయిన కాలు పూర్తిగా నయం కాకపోవడం పై ఆస్పత్రి పై చర్యలు తీసుకోవాలని ఆయన కూడా వినతి పత్రం అందజేశారు.

పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీపీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలంలోని ధర్మారావుపేట్ ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ గైని అనసూయ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రయివేటు నుంచి ప్రభుత్వ స్కూల్‌లో 30 మంది విద్యార్థులు వచ్చి చేరడం గర్వకారణం అని అన్నారు.

నిరుపేద కుటుంబాలకు టార్పాలిన్ అందజేత


టార్పాలిన్ కవర్లు అందజేస్తున్న సభ్యులు

నవతెలంగాణ-దోమకొండ

కొన్ని రోజుల క్రితం వర్షాలకు ఇండ్లు కూలిపోయిన నిరుపేద కుటుంబాల వారికి దోమకొండ మండల కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టార్పాలిన్, దుప్పట్లను వంట సామాగ్రిని నిరుపేదలకు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బుర్రి రవికుమార్, డివిజన్ ఉపాధ్యక్షులు పున లక్ష్మణ్, డివిజన్ సభ్యులు కంది వినోద్ కుమార్, మండల సభ్యులు పాలకుర్తి శేఖర్, చిన్నంగారి నర్సింహులు, బత్తిని సిద్ధ రాములు, ఆవు దూత సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ తహసీల్దార్‌గా వనజ రాణి

నవతెలంగాణ-ముప్కాల్



ముప్కాల్ నూతన తహసీల్దార్‌గా వనజ రాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్మెంట్ నుంచి పదోన్నతిపై ముప్కాల్ తహశీల్దార్‌గా వచ్చారు. గతంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్ ఆమెను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రెవిన్యూ సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీకాంత్, సూపరింటెండెంట్ దశరథ్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ గంగారాం, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాలలకు తక్కువ సీట్లు కేటాయించడం సరికాదు

- మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సీట్ల కేటాయింపులో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నిజామాబాద్ నగరంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 60 నుంచి 65 లక్షల దళితుల జనాభా ఉందన్నారు. కాగా మాలలకు కేవలం 7 సీట్లు మాత్రమే కేటాయించారని, జనాభా ప్రాతిపదికన మాలలకు తక్కువ సీట్లు కేటాయించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మిగిలిన 4 జనరల్ సీట్లను మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

నిర్మాణరంగ పనికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిర్మాణ రంగంలో పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీలు సివిల్ ఫోర్‌మెన్, షట్టరింగ్ కార్పెంటర్, కాంక్రీట్ మేసన్, స్టీల్ ఫిక్సర్, ప్యానెల్ బీటర్, స్ప్రేయర్ పైనా సంబంధిత విభాగాల్లో ఫీల్డ్‌లో 5సంవత్సరాల అనుభవం తప్పనిసరని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టాంకాం ఆధ్వర్యంలో 24న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. వివరాలకు 7893566493, 8247838789, 8328602231 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపు బాజిరెడ్డి ర్యాలీ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను మరోసారి అధిష్టానం నుంచి టికెట్ ఖరారైన సందర్భంగా మొదటిసారిగా నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గానికి విచ్చేస్తున్న సందర్భంగా బుధవారం భారీ వాహన ర్యాలీ చేపట్టనున్నారు. వివిధ మండలాలకు చెందిన స్థానిక ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉపసర్పంచులు, సొసైటీ చైర్మన్లు, సొసైటీ డైరెక్టర్లు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొననున్నారు.

ఐటీఐలో ఐఓటీ హెల్త్ కేర్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల బాలికల ఐటీఐలో పూర్వపు ఏడు కోర్సులతో పాటు ఐటీఐలో నూతన కోర్స్ ఐఓటీ హెల్త్ కేర్ కోర్స్ ప్రవేశపెట్టారని, ఇందులో ప్రవేశానికి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బాలికల ఐటీఐ ప్రిన్సిపాల్ లక్ష్మణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 19 నుంచి 30 వరకు ఊఊఊ.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీఙ.ఱఅ వెబ్సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవలు ప్రారంభం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా వృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవలను నిజామాబాద్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు మంగళవారం ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో వృద్ధులకు ఇంటివద్దనే సేవలందించేందుకు సంచార వాహనం ఏర్పాటు చేయాలన్న జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ సంచార వాహన వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ సంచార వాహనం ద్వారా వయో వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సంచార మెడికల్ వాహనం ద్వారా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గ్రామ పంచాయతీ ముదక్‌పల్లిలో డాక్టర్ ఆశిష్ రాజ్ సుమారు 150 మందికి వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు చేసి ఫ్రీగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపాల్ మండల చైర్మన్ వెంకటేశ్వరులు, బాబా శ్రీనివాస్, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రమేష్, పి.ఆర్.ఓ బొద్దుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంలకు సహకరించండి

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

రాష్ట్ర ప్రభుత్వం సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతూ సెకండ్ ఏఎన్‌ఎంలు గత వారం రోజుల నుంచి నిరసన చేపడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా మంగళవారం మోస్రా మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో విధులు నిర్వహిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు డాక్టర్ విజయ్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రెగ్యులర్ చేసేందుకు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రానికి చెందిన బద్దం ముత్యం రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో నుంచి ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముత్యం రెడ్డి మాట్లాడుతూ.. సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, గడ్డం జీవన్, ముస్కు మోహన్, లింగారెడ్డి, రేండ్ల రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్స్ బోర్డు ప్రారంభం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర రోటరీ ఇంటర్నేషనల్ గవర్నర్ బుసిరెడ్డి శంకర్ రోటరీ క్లబ్ జేమ్స్ నిజామాబాద్‌కు అధికారిక పర్యటనలో భాగంగా విచ్చేయగా.. డిచ్‌పల్లి వద్ద బైపాస్ రోడ్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ సైన్ బోర్డును ప్రారంభించారు. అలాగే కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో మరో సైన్ బోర్డును ప్రారంభిచారు. అనంతరం నిజామాబాద్ నగరంలోని దుబ్బ గవర్నమెంట్ స్కూల్లో రోటరీ క్లబ్ జేమ్స్ తరపున స్పాన్సర్ చేసిన మూడు ఐరన్ డోర్స్ డిజిటల్ తరగతుల నిమిత్తం స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ గంగయ్య, జేమ్స్ అధ్యక్షుడు విజయ్‌కాంత్ రావ్, కార్యదర్శి వీర బ్రహం, ప్రాజెక్టు చైర్మెన్ కోటగిరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి

నవతెలంగాణ-నవీపేట్

దేశంతో పాటు రాష్ట్రంలో కుటుంబ పాలన పార్టీలకు స్వస్తి పలకాలని మహారాష్ట్ర పండరీపూర్ ఎమ్మెల్యే సమాధాన్ మహాదేవ్ ఔతాలే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బీజేపీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ఓడించి అవినీతి రహిత పాలన చేస్తున్న బీజేపీని బోధన్‌లో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో, బోధన్ నియోజకవర్గంలో ఒకే వర్గ ప్రజలకు సంక్షేమం జరుగుతుందని మేడిపాటి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అవినీతి సొమ్ము రూ.100 కోట్లు ఖర్చుపెట్టిన బోధన్ నియోజకవర్గంలో ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించబోరని వడ్డీ మోహన్‌రెడ్డి అన్నారు. అనంతరం రాజేందర్‌గౌడ్‌ను మండల ప్రధాన కార్యదర్శిగా, బండారి రాజశేఖర్‌ను బీజేవైఎం కన్వీనర్‌గా నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు సరిన్, నియోజకవర్గ ఇన్చార్జి శ్రీధర్, ఆనంద్, సొసైటీ చైర్మన్ శైలేష్ కుమార్, సర్పంచ్ రొడ్డ సుధాకర్, వంశీ మోహన్, ఎంపీటీసీ రాధ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకోం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆదివాసీ నాయకపోడుపై లేనిపోని అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని, మీడియా ముసుగులో తమను వ్యక్తుల బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆదివాసి నాయకపోడు అధ్యక్షులు గాండ్ల రామచందర్ ఆరోపించారు. ఆదివాసీ నాయక్‌పోడు సేవా సంఘం నాయకులు జిల్లా కలెక్టరేట్ కు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్లో ఏవోకు సమర్పించారు.

పెంచిన వేతనాలను వెంటనే అందించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు

నవతెలంగాణ-భీంగల్

ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇటీవలే పెంచిన వేతనాలను వెంటనే అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు కోరారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో వెట్టిచాకిరి చేస్తున్న కార్మికులకు అందజేస్తున్న జీతాలు సరిపోక పెరుగుతున్న నిత్యావసర ధరల వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కనుక ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన వేతనాలను అందించాలని, అలాగే నాలుగు సంవత్సరాలుగా ఈఫీఎఫ్, పీఎఫ్ డబ్బులను తీసుకుంటున్నప్పటికి మున్సిపాలిటీ పాలకవర్గం తమ వాటాను కలిపి వారి ఖాతాలలో జమ చేయడం లేదని కనుక వాటిని కూడ జమచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో పాటు వారానికి ఒకరోజు సెలవును అందించాలన్నారు. అనంతరం అదికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, నాగేశ్వర్, కార్మిక సంఘం నాయకులు విశ్వనాథ్, విజయ్, బాలమ్మ, లక్ష్మి, సాయవ్వ, రాజన్న తదితరులున్నారు.



25న ప్రజా ఆశీర్వాద ర్యాలీ

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మూడవసారి టికెట్ పొందిన సందర్భంగా పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికేందుకు ఆర్మూర్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు సమాయత్తమవుతున్నారు. ముచ్చటగా మూడోసారి పార్టీ టికెట్‌తో ఈ నెల 25వ తేదీ ఉదయం 9గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి ఆర్మూర్ పట్టణంలో అడుగు పెట్టనున్న జీవన్‌రెడ్డికి రెండు వేల కార్లతో, వెయ్యి బైక్‌లతో అఖండ స్వాగతం పలకనున్నారు. పెర్కిట్ హై వే బ్రిడ్జి నుంచి అంకాపూర్‌లోని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నివాసం వరకు బీఆర్ఎస్ శ్రేణుల ర్యాలీ జరగనుంది. ఇందు కోసం గులాబీ శ్రేణులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా జీవన్‌రెడ్డి అభ్యర్థిత్వం ఖరారు కావడం పట్ల పార్టీలో నయా జోష్ కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో పోరాడి జీవనన్నకు హ్యాట్రిక్ విక్టరీని కానుకగా ఇస్తామని బీఆర్ఎస్ సైన్యం స్పష్టం చేస్తోంది. 25వ తేదీ ప్రజా ఆశీర్వాద ర్యాలీకి ప్రజలంతా తరలివచ్చి జీవన్‌రెడ్డిని ఆశీర్వదించాలని నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులతో పాటు గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఆర్మూర్ మున్సిపాలిటీ చైర్మన్ ఆధ్వర్యంలో మొత్తం 36 మంది వార్డు సభ్యులు ఈ ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొనాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ వారికి లేఖలు రాసింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, నాయకులు పండిత్ ప్రేమ్, లింబాద్రి గౌడ్, సుంకరి రవి, జనార్ధన్ గౌడ్, మోత్యారి లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీకి రావాలని ఆహ్వానం అందజేత

ప్రకృతి వనరులను ఉపయోగించుకోవాలి

- ఐసీఐసీఐ ఫౌండేషన్ సీఎఫ్ చింత శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రకృతి ప్రసాదించిన వనరులను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఆర్థిక నష్టాన్ని తగ్గించవచ్చని ఐసీఐసీఐ ఫౌండేషన్ సీఎఫ్ చింత శ్రీనివాస్ అన్నారు. మండలంలోని హాసకొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం పరిశీలించిన ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో సోలార్ విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగిపోతుందని, దాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక పాఠశాలలో తమ ఫౌండేషన్ ద్వారా సోలార్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సోలార్ సిస్టం ఏ విధంగా పనిచేస్తుందో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఒక్క కే.వి యూనిట్ ఏర్పాటుకు లక్ష రూపాయలు ఖర్చు పెడుతున్నామని, అలా హాస కొత్తూర్ పాఠశాలలో మూడు కే.వి సామర్థ్యం గల యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా పాఠశాలల్లో వాటర్ హార్వెస్టింగ్ సోలార్ సిస్టమ్స్, ఆర్ఓ యూనిట్లు ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సోలార్ సిస్టంపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

కల్లు సీసాలో ప్లాస్టిక్ కవర్

నవతెలంగాణ-బోధన్



కల్లు ప్రియులు కల్లు సేవించడానికి కల్లు దుకాణాలకు వెళితే వారికి అపరిశుభ్రమైన కల్లు విక్రయిస్తున్నారు. దానికి నిదర్శనమే ఈ ఫోటోలో ఉన్న చిత్రం. సాలూర మండల కేంద్రంలోని ఓ కల్లు దుకాణంలో మంగళవారం స్థానిక నాయకుడు కల్లు సీసా తీసుకొని తాగగా అందులో ప్లాస్టిక్ పేపర్ దర్శనమిచ్చింది. దాంతో ఆ నాయకుడు అవాక్కయ్యాడు. డబ్బులు వెచ్చించి కల్లు సేవిస్తే అపరిశుభ్రమైన బాటిళ్లలో కల్లు నింపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతారా? అంటూ ఆయన కల్లు వ్యాపారులపై మండిపడ్డాడు. ప్రతిరోజు నిరుపేదలు కూలీ పనులు చేసి కల్లు సేవించడానికి కల్లు దుకాణాలకు ఆశ్రయిస్తారు. కల్లు వ్యాపారులపై నమ్మకంతో ప్రతిరోజు ఎందరో నిరుపేదలు కల్లును సేవిస్తున్నారు. అలవాటులో పొరపాటుగా కలుషితమైన కల్లు తాగడం వలన కల్లు ప్రియులు అనారోగ్యం బారిన పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. కల్లు సీసాలను శుభ్రంగా కడిగి అందులో నింపవలసిన కల్లు వ్యాపారులు అవేమీ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో ఇలా చెత్త చెదారం, ప్లాస్టిక్ పేపర్లు దర్శనమిస్తున్నాయని కల్లు ప్రియులు నిర్వాహకుల తీరుపై మండిపడుతున్నారు. తనిఖీలు చేయవలసిన ఎక్సైజ్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి అపరిశుభ్రమైన కల్లును విక్రయిస్తున్న కల్లు దుకాణాలపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కల్లు ప్రియులు డిమాండ్ చేస్తున్నారు. కల్లు సీసాలో ప్లాస్టిక్ పేపర్ ఉన్న వీడియో వాట్సప్‌లో చక్కర్లు కొట్టడంతో ఈ ఘటన అందరి దృష్టికి వెళ్లింది.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-రెంజల్

సీజనల్ వ్యాధులపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన అవసరమని మలేరియా యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ముందుగా దోమలపై వచ్చే వ్యాధులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన బాలికలకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి వైష్ణవి, ద్వితీయ బహుమతి అక్షశ్రీ, తృతీయ బహుమతి లహరిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వలన వచ్చే వ్యాధులు మలేరియా, ఫైలేరియా, మెదడువాపు, డెంగీ చికెన్ గునియా, మొదలగు వ్యాధులు సోకుతాయని కాబట్టి ప్రతి కుటుంబం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు పుట్టకుండా కుట్టకుండా చూసుకోవాలన్నారు. రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినయ్ కుమార్ మాట్లాడుతూ దోమలు పరిసరాలలో పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా నీటి ద్వారా వచ్చే వ్యాధులు డయేరియా, పచ్చకామెర్లు, టైఫాయిడ్ వ్యాధులు రాకుండా స్వచ్ఛమైన నీటిని వినియోగించు కోవాలని ఆయన సూచించారు. బాలికలు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ భోజనానికి ముందు, తరువాత, చేతులు శుభ్రంగా కడుక్కుని భోజనం చేయాలన్నారు. అనంతరం డాక్టర్ వినయ్‌కుమార్ విద్యార్థిని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 250 మందికి గాను 213 మంది బాలికలు ఉన్నారని వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి చింతాల శ్రావణ్ కుమార్, ఆరోగ్య సూపర్వైజర్ మాలంబి, ఆరోగ్య కార్యకర్తలు శాంతకుమారి సరస్వతి, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేత

లిఫ్ట్‌ల మరమ్మతులకు రూ.4.65 కోట్లు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ పరిధిలో నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.4కోట్ల 65లక్షల 18వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం ఆ నిధులు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిధుల నుంచి నికాల్‌పూర్ లిఫ్ట్ మరమ్మతుల కోసం రూ.87లక్షల 50 వేలు, తల్వేద లిఫ్ట్ మరమ్మతుల కోసం రూ.కోటి 65 లక్షలు, మారంపల్లి లిఫ్ట్ మరమ్మతుల కోసం రూ.77 లక్షలు, వన్నెల్(కె) లిఫ్ట్ మరమ్మతుల కోసం రూ.కోటి 35 లక్షల 68 వేలను ఖర్చు చేయనున్నారు. కాగా తమకు ప్రధాన జీవనాధారమైన లిఫ్టుల మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల నికాల్‌పూర్, తల్వేద, మారంపల్లి, వన్నెల్(కె) గ్రామాల రైతుల్లో ఆనందోత్సవాలు వ్యక్తమయ్యాయి. ఈ నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా నాలుగు లిఫ్టుల కోసం తాను అడిగిందే తడవుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల పీయూసీ చైర్మన్, ఆ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నిధులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆర్మూర్ నియోజకవర్గ రైతాంగం తరపున జీవన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ఉద్యమ నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ

నవతెలంగాణ-బోధన్



మండలంలోని పెంటాఖుర్దు గ్రామానికి చెందిన చిట్టెపు కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేత, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శివసాయి పటేల్‌కు మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివసాయి పటేల్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయంగా, ఆర్థికంగా దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన గుద్దేటి లింగవ్వకు రూ.21వేలు, పుప్పాల నర్సుకు రూ.18వేలు, ఎం.నవ్యకు రూ.14,500 మంజూరు అయ్యాయి. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మండలంలోని ఎంపీపీ కార్యాలయంలో మండల ఎంపీపీ కుంచల విమల రాజు అధ్యక్షతన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, మండల కోఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్‌ఖాన్, చింతలూరు ఉపసర్పంచ్ జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో ప్రత్యేక సమీక్ష సమావేశం

నవతెలంగాణ-సిరికొండ

రాబోయే ఎన్నికల దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాలలో 18 సంవత్సరాలు పైబడిన యువతీ యువకులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ వారిచేత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించాలని తహసీల్దార్ రవీందర్రావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకులు తప్పకుండా తమ ఓటు హక్కును నమోదు చేసుకునే విధంగా గ్రామాలలో దండోరా వేయించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తమ గ్రామాలు, మండలం, జిల్లా స్థాయిలో అభివృద్ధి జరగాలంటే తప్పకుండా వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో లక్ష్మీ ప్రసాద్, ఎంఆర్ఐ గంగారాజం, ఏఆర్ఐ నాగన్న, సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

డీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మారెడ్డి మరణం పట్ల సంతాపం

నవతెలంగాణ-కంఠేశ్వర్

డీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మారెడ్డి మరణం పట్ల డీటీఎఫ్ నాయకులు మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ 1999లో ఆవిర్భవించడానికి విశేష కృషి చేసిన డీటీఎఫ్ సంస్థ మొదటి రాష్ట్ర అధ్యక్షులు ఎస్.లక్ష్మారెడ్డి (81 సంవత్సరాలు) నిన్నటి రోజు (21.8.2023)న అనారోగ్యంతో స్వస్థలం గుంటూరులో తుది శ్వాస విడిచారని నాయకులు తెలిపారు. ఆయన మరణం పట్ల డీటీఎఫ్ నిజామాబాద్ జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.బాలయ్య, ఆర్.రాజన్న మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శంతన్ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు.

ఐఐహెచ్‌ఎఫ్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

నవతెలంగాణ-భీమ్‌గల్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్‌గా నియమించిన డా.మధు శేఖర్‌ను భీంగల్ మండల దళిత ఐక్య సంఘటన మండల అధ్యక్షుడు గడాల ప్రసాద్, కార్యదర్శి గంట భాగేష్, మొండి ప్రశాంత్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గడల ప్రసాద్, గంట భాగేష్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో గత 30 సంవత్సరాలుగా చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సర్జికల్, మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించి ఎందరికో ఉచిత ఆపరేషన్లు చేసిన గొప్ప వ్యక్తి డా.మధుశేఖర్ అటువంటి సేవ దృక్పథం కలిగి ఉన్న వ్యక్తికి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్‌గా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో డా.మధు శేఖర్‌కు మరిన్ని ఉన్నత పదవులు రావాలని ఈ సందర్భంగా వారు కాంక్షించారు.

మద్దేపల్లిలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని మద్దేపల్లి గ్రామంలో నిరుపేదలకు శివమ్మ ట్రస్ట్ చైర్మన్ తూము శరత్‌రెడ్డి, బోధన్ మున్సిపల్ చైర్మన్ పద్మ పేదలకు నిత్యావసర సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శరత్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ సర్వే టీం ఆధ్వర్యంలో గ్రామంలో నిరుపేదలను గుర్తించి వారికి సుమారు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించనున్నట్టు తెలిపారు. అలాగే నిరుపేదల అంత్యక్రియలు అనారోగ్య సమస్యలు చదువుల నిమిత్తం సైతం ఆదుకునేందుకు ముందు ఉంటానని అన్నారు. గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లే రోడ్డు భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసం కావడంతో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరగా పరిశీలించి స్వతహాగా మొరం వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ షకీల్ అమీర్‌ను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి టికెట్ ఖరారు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. మండలంలోని జానకంపేట్ గ్రామంలోని అంబేద్కర్, గాంధీ చౌరస్తాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సంబురాలు నిర్వహించారు.

నూతన ఆర్డీవోకు సన్మానం


ఆర్డీవోను సన్మానిస్తున్న రేషనల్ డీలర్లు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి డివిజన్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌ను ఎల్లారెడ్డి రేషన్ డీలర్లు మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం నూతనంగా వచ్చినా తహశీల్దార్ యూ సురేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు నాగం సురేందర్, ఎల్లారెడ్డి రేషన్ డీలర్ల అధ్యక్షుడు విట్టల్ గౌడ్, కేషయ్య, మామిడి శ్రీనివాస్, ఆగమయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన యువకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పలువురు మంగళవారం మండల కేంద్రంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పని చేయాలని అన్నారు. ఈ చేరికలో సుమేర్, నుమాన్, మోయిజ్, సూఫీయాన్, మున్ను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఓటరూ.. ఓటింగ్‌లో పాల్గొనాలి

- వయోవృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- పోలింగ్ ప్రక్రియ, ప్రత్యేక సదుపాయాలపై వయోవృద్ధులకు అవగాహన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఓటు హక్కు కలిగిఉన్న ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటింగ్ లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం వయోవృద్ధులకు పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తూ, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వి.వి.ప్యాట్‌ల పనితీరుపై అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఓటు హక్కును ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని హితవు పలికారు. జిల్లాలో ఎంతో చైతన్యం కలిగిఉన్న వయోవృద్ధులు ఓటింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు అనేక మార్పులు చేపడుతూ, వివిధ రకాల సదుపాయాలను అందుబాటులోకి తెస్తోందని కలెక్టర్ గుర్తు చేశారు. ఇందులో భాగంగానే ఎనభై ఏళ్ళు పైబడిన వయోవృద్ధులు, దివ్యంగులు తమ ఇంటి నుండే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటును కల్పించిందని వివరించారు. ఇంటి నుండి ఓటు వేయదల్చుకున్న వారు ఎన్నికల ప్రకటన వెలువడిన మీదట నిర్ణీత ఫారం నింపి తమ అభ్యర్థనను తెలియజేస్తే, పోలింగ్ అధికారి నేతృత్వంలోని సిబ్బంది వారి ఇంటి వద్దకు వచ్చి సీక్రెట్ బ్యాలెట్ విధానాన్ని అనుసరిస్తూ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ సదుపాయాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వయోవృద్ధుల కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, వీల్ చెయిర్ వంటి సదుపాయాలూ అందుబాటులోకి తేవడం జరిగిందని అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుపై అనుమానాలను నివృత్తి చేస్తూ, పూర్తి అవగాహన కల్పించేందుకు వీలుగా కలెక్టరేట్, ఇతర కార్యాలయాల్లో నమూనా కేంద్రాలను నెలకొల్పినట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి పలువురు సీనియర్ సిటిజన్ లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్స్ ను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, స్వీప్ నోడల్ అధికారి సింహాచలం, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, సీనియర్ సిటిజన్ ఫోరమ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు భూమన్న, రవీందర్, రామ్మోహన్, బుస్స ఆంజనేయులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.


ఓటు వేసే విధానంపై అవగాహన


వయోవృద్ధులకు ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల పక్షపాతి

- ఎంపీపీ దశరథ్ రెడ్డి


చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ- రామారెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ ఫలాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నిలిచిపోయిందని, కెసిఆర్ ప్రభుత్వం ప్రజల పక్షపాతి అని ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వివిధ గ్రామాలకు సంబంధించిన 30 కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్ రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు 50 సంవత్సరాల నుండి చేయని పనులను, కెసిఆర్ ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, ఎండాకాలంలో నీటి కోసం ఆడవాళ్ల కొట్టుకునే బాధ మిషన్ భగీరథ నీటితో పోయిందని, కల్యాణ లక్ష్మీతో పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని అన్నారు. రైతుల కోసం రైతు బీమా, రైతుబంధు, రైతు వేదికలు, దళితులకు దళిత బంధు, మైనార్టీలకు మైనార్టీ బంధు, బీసీలకు బీసీ బంధుతో ప్రభుత్వం తెలంగాణను అభివద్ధి పథంలో తీసుకెళ్తుందని, బంగారు తెలంగాణ అంటే ప్రజలు అభివద్ధి చెందడమే నని అన్నారు. మళ్లీ వచ్చే ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ ను భారీ మెజార్టీతో గెలుపొందించాలని అన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ రోజా, వైస్ ఎంపీపీ రవీందర్రావు, రైతుబంధు మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, ప్రజా ప్రతినిధులు రాజేందర్, ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్



రామ్మోహన్‌రావును సన్మానిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వద్దులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. ముఖ్యంగా రాబోయే ఎన్నికలలో వృద్ధుల ఓటింగ్ శాతం పెరగడానికి తగిన సౌకర్యాలు కల్పించాలనీ ,అందులో ముఖ్యంగా ఓటు వేసేటప్పుడు ప్రత్యేక లైను ఏర్పాటు చేయాలని, ఉచితంగా రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, పోలింగ్ బూత్ ఎక్కడుందో తెలియజేస్తూ ముందుగానే సమాచారం ఇవ్వడం ,80 సంవత్సరాలు దాటిన, మరియు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో నడవలేని వారికి ఇంటి నుండే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజనులకు ,రిటైర్డ్ ఉద్యోగులకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా కే. రామ్మోహన్‌రావును జిల్లా కలెక్టర్ అభినందిస్తూ శాలువతో సన్మానించి మెమొంటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చిత్ర మిశ్రా, యాదిరెడ్డి మున్సిపల్ కమిషనర్, డి.సి. ఓ.సింహాచలం, జిల్లా సంక్షేమ అధికారి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


మృతిచెందిన సాయిలు

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపినా వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మండలం సాతెలి గ్రామానికి చెందిన మైలారం సాయిలు (45) వ్యక్తి పొలానికి వాడే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనారోగ్యంతో జీవితం పైన విరక్తి చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు మతుడి భార్య బుచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తాం


క్యాంపస్ పరిసరాలను పరిశీలిస్తున్న పంచాయతీ అధికారి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్న సౌత్ క్యాంపస్‌లో రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు లేక అడవి పందులతో రోడ్డు ప్రమాదాలు, పాముల బెడద ఉన్న విషయాన్ని ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా స్పందించిన మండల పంచాయతీ అధికారి ప్రవీణ్ కుమార్ మంగళవారం సౌత్ క్యాంపస్ లో పరిశీలించి విద్యుత్ దీపాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు, పాములు, అడవి పందులు రాకుండా చర్యలు తీసుకోవాలని క్యాంపస్ ప్రిన్సిపాల్ కు సూచించారు. క్యాంపస్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి పంచాయతీ కార్యదర్శికి ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జాజాల మంత్రి కావాలని ఎంపీటీసీ పాదయాత్ర

నవతెలంగాణ-సదాశివనగర్

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజల సురేందర్ మంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు పాపనొన్నల బీరయ్య మంగళవారం సదాశివనగర్ నుండి ఇస్సన్నపల్లి వరకు పాదయాత్ర చేశారు. ఇస్సన్నపల్లి గ్రామంలో ని కాళభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయంచారు. ఆయన వెంట రామరెడ్డి మండలం ఎం పి పి దశరథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్ ఉప్పల్ వాయి గంగారాం, గాదారి అశోక్ రెడ్డి, కుమ్మరి రాజయ్య, పెసరి సాయి లు , తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

మాజీ మంత్రి షబ్బీర్ అలీ తనయుడు రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి ఇలియాస్ పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి గౌడ్, ఎంపీటీసీ మోహన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు కిరణ్ కుమార్, జీవన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు


ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని భవిత పాఠశాలలో మంగళవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన 8మంది విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు ఫిజియోథెరపిస్టు నవీన్ సాయి నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ చేయడం వల్ల కొంత ఉపశమనం లభిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పిఈటి హనుమంత్ రెడ్డి, ఐఈఆర్పిలు మహేందర్, శ్యామ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ముఖాల్లో ఆనందం చూస్తున్నాం

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-తాడ్వాయి

సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో రైతుల ముఖాల్లో ఆనందం చూస్తున్నామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత 50 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిందని తెలిపారు. సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని,రైతులకు రైతుబంధు, రైతు బీమా అందిస్తున్నారన్నారు రైతులకు రుణమాఫీ అందించడంతో రైతులు ఎంతో సంతోషపడుతున్నారని తెలిపారు. రైతుల ముఖాల్లో ఆనందం చూస్తున్నామన్నారు. ప్రతి రైతుకు రూ 1 లక్ష వరకు రుణాన్ని మాఫీ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో హర్షించదగిందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వికలాంగులకు నెల నెల రూ.4016, వృద్ధులకు, వితంతువులకు,బీడీ కార్మికులకు నెల నెల రూ. 2016 అందిస్తున్నారని తెలిపారు.రాష్ట్రంలోని పేదలు పెళ్లి చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే లక్ష్యంతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టి పేద మహిళలకు అండగా నిలిచారని తెలిపారు. ప్రజలు మరోసారి కెసిఆర్ సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. ఎల్లారెడ్డిలో తాను గత ఐదు సంవత్సరాలుగా ప్రజల మధ్యనే ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా 22 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కౌడి రవి, జెడ్పిటిసి రమాదేవి నారాయణ, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మద్ది మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పులగం సాయి రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ నల్లవెల్లి కపిల్ రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులు ,సర్పంచ్ సంజీవులు, నాయకులు రాజు గౌడ్, ప్రభాకర్ రెడ్డి ,రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న జాజాల సురేందర్

బీసీ సంఘ భవనం కేటాయించాలి

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీ సంఘానికి భవనం కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 60 శాతం ఉన్న బీసీ కులాల ప్రజల పలు పనుల నిమిత్తం నిత్యం జిల్లా కేంద్రానికి రావాల్సి వస్తుందని, జిల్లా కేంద్రం నుంచి సుమారు 120 కిలోమీటర్ల దూరం నుండి సామాన్య ప్రజలు ఇక్కడికి రావడం, పనులు పూర్తి కానప్పుడు మళ్లీ వెళ్లి రావడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భాలు చాలా వున్నాయని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని జిల్లా కేంద్రంలో బీసీ భవనం కోసం రెండు ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాప శివరాములు నేత, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు మారోజు మోహణాచారి, సిహెచ్ రాజయ్య, హాజీ అబ్దుల్ అజీజ్, ఈదుల్ హుస్సేన్, ప్రధానకార్యదర్శి పెద్దోళ్ల మహేష్, నాగోజు నారాయణ రావు, అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లన్న తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్నూర్‌లో సంబురాలు


సంబురాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గంలో ముచ్చటగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన హన్మంత్‌షిండేకు మరోసారి బీఆర్ఎస్ టికెట్ ప్రకటించడంతో మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం సంబురాలు చేపట్టారు. టపాకాయలు కాలుస్తూ హర్షం వ్యక్తం చేశారు. మరోసారి బ్రహ్మాండమైన మెజార్టీతో హన్మంత్‌షిండేను గెలిపించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బన్సీ పటేల్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు గఫర్, ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్, సీనియర్ నాయకులు కాశీనాథ్ పటేల్, పండితరావు పటేల్, పాకల విజయ్, రచ్చ కుశాల్ నూతనంగా ఎన్నికైన యూత్ అధ్యక్షులు సుధాకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కండ్లకు గంతలతో ఏఎన్ఎంల నిరసన



కండ్లకు గంతలు కట్టుకొని ఏఎన్ఎంల నిరసన

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు రెండవ ఏఎన్ఎంలు తమ సమ్మెలో భాగంగా మంగళవారం కండ్లకు గంతలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ ఏడు రోజులుగా సమ్మె చేపట్టినా.. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని, వెంటనే ఏఎన్ఎంల డిమాండ్‌లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వారిని రెగ్యులర్ చేసి, నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. డిమాండ్‌లు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టంచేశారు. అనంతరం టి జి ఎస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, ఫుల్ సింగ్, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ రవి, మదన్ లాల్ యాదవ్ తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ దశరథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బాల్ రాజ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడికి సన్మానం


మండలాధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్దఎక్లారాకు చెందిన సుధాకర్ పటేల్‌ను నాయకులు, కార్యకర్తలు మంగళవారం సన్మానించారు. అంతకుముందు సమావేశమైన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షులు బన్సీ పటేల్ శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మద్నూర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు షేక్ గఫర్, ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్ పార్టీ సీనియర్ నాయకులు సోమూర్, కాశీనాథ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ కార్యదర్శి జన్మదిన వేడుకలు


రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-మాచారెడ్డి

తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి మహమ్మద్ ఇలియాస్ జన్మదిన సందర్భంగా మాచారెడ్డి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చెల్లాపురం రాజిరెడ్డి, పోడు భూముల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు కొమురయ్య, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు జాదవ్ కాంగ్రెస్ నాయకులు రాజుస్వామి సత్యం మోహన్ నాయక్ సురేష్ మండల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవిర్భావం · ఆదర్శాల

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

బుధవారం 23 ఆగస్టు 2023

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గ్రామానికి చెందిన చిల్యారి గంగారెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.17000 చెక్కును మాజీ సర్పంచ్ కాట్‌పల్లి నర్సారెడ్డి చేతుల మీదుగా లబ్దిదారుల కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ చెక్కును మంజూరు చేసిన మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌కు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



చెక్కు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పోచారం గ్రామ చెరువు కట్ట అలుగు సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ కోల ఇంద్రకరణ్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పోచారం, జైతాపూర్, ధర్మారం ఉమ్మడి గ్రామాల ఎంపీటీసీ సభ్యురాలు పద్మా ముత్తెన్న, గ్రామ పెద్దలు సుదర్శన్, సురేష్, కట్ట సుధాకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

సొసైటీ భవన ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీకి ఆహ్వానం

నవతెలంగాణ-నవీపేట్

బినోల సొసైటీ నూతన భవన ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్సీ కవితను చైర్మన్ మగ్గరి హన్మండ్లు ఆహ్వానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 25 తర్వాత ప్రారంభోత్సవానికి తేదీ ఖరారు చేయనున్నట్లు, ఎమ్మెల్యే షకీల్‌ను సైతం ఆహ్వానించినట్లు చైర్మన్ తెలిపారు. ఆయన వెంట డైరెక్టర్ విజయ్ ఉన్నారు.

క్రీడాకారులకు వాలీబాల్, టెన్నికైట్స్ వితరణ



క్రీడవస్తువులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ బృందం

నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ అఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్ దాస్ హేమలత జిల్లా పరిషత్ పెర్కిట్ పాఠశాలలో, పట్టణంలోని బాలుర పాఠశాలలో క్రీడాకారులకు వాలీబాల్స్, టెన్నికైట్స్ మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్‌దాస్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 205 దేశాలలో లయన్స్ సేవలు నిర్వహించడం జరుగుతుందని పట్టణంలోని లయన్స్ భవన్‌లో కంటి చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తున్నామని, పరిసర ప్రాంత వాసులు వినియోగించుకోవాలని అన్నారు. లయన్స్ సేవలలో భాగంగానే పాఠశాల క్రీడాకారులకు క్రీడా సామాగ్రి వాలీబాల్స్, టెన్నికైట్స్‌ను హేమలత వితరణ చేశారు. కార్యక్రమంలో లయన్స్ లోచర్ చంద్రశేఖర్, జ్ఞానీ చావుల బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత, పీడీ మల్లేష్‌గౌడ్, పెర్కిట్ పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగశయన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లపై ఉన్న శ్రద్ధ డబుల్ బెడ్‌రూమ్‌లపై లేదా..?

- సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ పార్టీ ఉత్తర తెలంగాణ కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-ఆర్మూర్

కోటి ఆశలతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వానికి మద్యం టెండర్లపై ఉన్న ఆత్రుత అర్హులైన పేదలకు ఇండ్లు ఇచ్చే ఆలోచనలో లేదని సీపీఐ (ఎంఎల్) రామచంద్రన్ పార్టీ ఉత్తర తెలంగాణ కార్యదర్శి ఎస్.సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉచిత పథకాల పేరుతో ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన తొమ్మిదేండ్ల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా కొత్త హామీలను ఇస్తుందని అన్నారు. గడిచిన తొమ్మిదేండ్ల సమయంలో అర్హులైన పేదలకు డబల్ బెడ్రూమ్ ఇండ్లు ఎందుకు పంపిణీ చేయలేదో, దళితులకు మూడెకరాల భూమి, దళిత, బీసీబంద్ ఎంతమందికి అందించిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల కోసం పెద్ద పెద్ద భవనాలు నిర్మించి, రోడ్లు వెడల్పు చేయడం ఒక్కటే అభివృద్ధి కాదని, అర్హులైన నిరుపేదలను గుర్తించి వారికి కనీస అవసరాలైన తిండి, బట్ట, ఉండడానికి ఇండ్లు అందుబాటులో ఉండాలని అన్నారు. గృహలక్ష్మీ పేరుతో ప్రజలకు రూ.3లక్షలు ఇస్తానన్న ప్రభుత్వం 3లక్షల రూపాయలతో ఎలా ఇల్లు నిర్మాణం జరుగుతుందో చెప్పాలని, పెరిగిన ధరలను అంచనా వేయకుండా 3లక్షలతో చేతులు దులుపుకోవాలని చూస్తుందని ఎద్దేవా చేశారు. పొట్ట కూటికోసం గ్రామాలను వదిలి సంవత్సరాల తరబడి ఇంటి అద్దె చెల్లిస్తూ దుర్భర జీవనం గడుపుతున్న ఆటో, భవన నిర్మాణ కార్మికులతో పాటు, అడ్డ కూలీలు, సాధారణ ప్రజలకు ఇంటి స్థలాలు ఇచ్చి పక్క ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. అర్హులైన వారికి ఫించన్లు, కొత్తరేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో విస్తృతంగా ప్రబలుతున్న విష జ్వరాల నియంత్రణ కోసం ప్రత్యేకంగా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని, అనారోగ్యం కారణంగా ప్రజలు ఆర్థికంగా చితికిపోతున్నారని అన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ దోపిడీపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అన్నారు.

33 శాతం రిజర్వేషన్‌పై ఎమ్మెల్సీ కవిత సమాధానం చెప్పాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

33 శాతం రిజర్వేషన్‌పై ఎమ్మెల్సీ కవిత సమాధానం చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత అన్ని రంగాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఢిల్లీలో పెద్ద ఎత్తున ధర్నా చేసిన విషయం అందరికీ తెలిసిందేనని, తెలంగాణ రాష్ట్రంలో సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్ సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేయనున్న వారి లిస్టు ప్రకటించిన దానిలో ఎమ్మెల్సీ కవిత కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేసిన 33శాతం రిజర్వేషన్ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో కూడా ఎమ్మెల్యేల అభ్యర్థుల లిస్టులో సుమారు 39 మంది మహిళా అభ్యర్థుల పేర్లు ఉండాలని, కానీ కేవలం 7 మంది మహిళ అభ్యర్థుల పేర్లు మాత్రమే ప్రకటించారని తెలిపారు. మరి 33శాతం రిజర్వేషన్ అన్న ఎమ్మెల్సీ కవిత తెలంగాణ ప్రజలకు, మహిళలకు సమాధానం చెప్పాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు ఓమయ్య, బి.రఘురాం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు సీఎం కేసీఆర్ శాసనసభ ఎన్నికలలో భాగంగా మూడవ సారి ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంతో మంగళవారం బోధన్ బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు సుదర్శన్ హైదరాబాద్‌లో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ కుర్మే రాజు, యూత్ ఉపాధ్యక్షులు నమిళ్ల చిన్న సాయన్న, గ్రామ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

కల్తీని నివారించేందుకు అప్రమత్తత అవసరం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సమాజంలో కల్తీని నివారించేందుకుగాను ప్రజలు అప్రమత్తమై కల్తీపై సమర శంఖాన్ని పూరించేందుకుగాను ప్రజలు సంసిద్ధంగా ఉండాలని తెలంగాణ వినియోగదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిలుపునిచ్చారు. 'జాగో గ్రాహక్ జాగో' అనే నినాదంతో సమాజంలో ప్రజలను కల్తీపై అప్రమత్తం చేయడమే తన సంఘం ప్రధాన లక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు. సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న కల్తీని నివారించేందుకు గాను ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే సమాజంలో వివిధ రకాల వస్తువుల కల్తీని అరికట్టే వీలుకలుగుతుందని తెలంగాణ సంఘం నేషనల్ కన్వీనర్ సింపుల్ తాయి రాథోడ్, తెలంగాణ వినియోగదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంభు రాథోడ్, స్పష్టం చేశారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఆయన ప్రకటించారు. తెలంగాణ వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన భుజంగ లింగంను నియమించినట్టు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సమాజంలో నిత్యావసర వస్తువులు కల్తీకి గురవుతున్నాయని, ప్రజలు జగ్రుతులై కల్తీని ప్రశ్నించినప్పుడే కల్తీ జరగకుండా నివారించేందుకు ఆస్కారం దొరుకుతుందని అన్నారు. తెలంగాణ వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం ఎంతైనా అవసరమని తెలిపారు. జిల్లా కమిటీని ప్రకటించిన తాము త్వరలోనే నిజామాబాద్ జిల్లాలోని అన్ని మండలాలలో కమిటీలు ఏర్పాటు చేసి తెలంగాణ వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, ప్రజలను చైతన్యవంతం చేస్తామని తెలిపారు. జిల్లా కమిటీలో జనరల్ సెక్రటరీగా మొహమ్మద్ హాజార్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కందకుర్తి రామకృష్ణ గుప్తా, వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్కే గుప్తా, జాయింట్ సెక్రటరీగా సాయి కిరణ్, సభ్యులుగా రాములు కొనసాగుతారని తెలిపారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా రామిరెడ్డిని నియమించినట్టు తెలిపారు.

29న చలో హైదరాబాద్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మోడీ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 29 ఆగస్టు చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాస్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మామిడిపల్లిలో చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడీ ఎన్నికల వాగ్దానాలు విస్మరించి, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం, అమ్మకానికి పెట్టడం, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా, 4 కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే కుట్ర చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రతి సంవత్సరం రెండు కోట్ల మందికి కొలువులు ఇస్తామని మాట నీళ్ల మూటగా మారిందని ఆయన అన్నారు. స్వచ్ఛ భారత్‌లో ముందు వరుసలో ఉండి కృషి చేస్తున్న సఫాయి కార్మికులను శాలువా కప్పి సన్మానిస్తే సరిపోదని 2016 అక్టోబర్ 26 తేదీన సుప్రీంకోర్టు తీర్పును ప్రకారం సమాన పనికి సమాన వేతనం కార్మికులకు అమలు చేయించాలని మోడీ ప్రభుత్వాన్ని దాసు డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ చట్టాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ బాటలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయాణించకుండా, కార్మిక హక్కుల అమలుపై కృషి చేయాలని ఆయన కోరారు. కెసిఆర్ గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె సందర్భంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేనిచో కార్మికుల కోపాగ్నికి బలికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆగస్టు 29న ఛలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నాను నిర్వహిస్తున్నామని ధర్నాలో అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దాసు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సూర్య శివాజీ, ఎండీ కాజా మొయినుద్దీన్ భానుచందర్, బీడీల మదర్, సధానంద్, తదితరులు పాల్గొన్నారు.

12పీఆర్‌సీ కమిటీ వేసి కార్మికుల వేతనాలు పెంచాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

12వ పీఆర్‌సీ కమిటీ వేసి కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 11వ పిఆర్సి సంబంధించిన కాల పరిమితి జూన్ 30తో ముగిసిందని జులై 1 నుంచి 12వ పిఆర్సి అమల్లోకి వచ్చి తద్వారా కార్మికుల వేతనాలు పెరగాల్సిన అవసరం ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ నేటికీ 12వ పిఆర్సి కమిటీని వేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానం చూస్తుంటే ఐఆర్ (మధ్యంతర భృతిని) చెల్లించి పిఆర్‌సిని చెల్లించకుండా ఎన్నికలకు పోయే పరిస్థితి కనపడుతుందని ఆ విధంగా చేస్తే తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉద్యోగులు, కార్మికులు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మికుల సంఖ్యను పెంచిన పనిచేస్తున్న కార్మికులపై పని భారం తగ్గటం లేదని కమిషనర్ చొరవ తీసుకొని పర్యవేక్షణ చేయాలని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎమ్ఆర్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలకు నిర్ణయించాలని బకాయిలో ఉన్న డీఏలను చెల్లించాలని సబ్బులు, చెప్పులు, నూనెలో పనిముట్లు ప్రతి సంవత్సరం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే పిఆర్సి కమిటీని వేసి ప్రకటించని యెడల సమ్మెకు వెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.నర్సింగరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.హనుమాన్లు, నాయకులు నరసమ్మ సాయి, బాలాజీ, కిషోర్, గోపి, సుజాత, ధర్మవ్వ మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్సీ అరికెల జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అరికెల నర్సారెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మాజీ ఎమ్మెల్సీ, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ అరికెల నర్సారెడ్డి పుట్టినరోజును కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన నివాసంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాహెర్‌బిన్ హుందాన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరికెల నర్సారెడ్డి మాట్లాడుతూ.. వచ్చే పుట్టిన రోజు నాటికి మన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు, కర్షకులకు మంచి రోజులు రాబోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏక మొత్తంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, అలాగే 500 రూపాయలకే సిలిండర్‌ను అందిస్తామని, ఇప్పటికే నిత్యావసర వస్తువులు మండిపోతున్నాయని, కానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ కేంద్ర ప్రభుత్వం గానీ ఏ రకంగానూ పట్టించుకోవటం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల పేరిట ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తుందని, కేంద్రప్రభుత్వమేమో దర్యాప్తు సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకొని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న వారిపై దాడులు నిర్వహిస్తుందని అలాగే కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలందరూ సమిష్టిగా ఉండి గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్క కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని ఆయన కోరారు.

డా.మధుశేఖర్‌కు సన్మానం



మధుశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ అధ్యక్షతన మంగళవారం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ మధుశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గోపికృష్ణ పట్వారి మాట్లాడుతూ.. చైర్మన్ పదవి పట్టణ వాసులుగా డాక్టర్‌కు రావడం చాలా ఆనందంగా ఉందని, వారి సేవలు చిరస్మరణీయం, స్ఫూర్తిదాయకమని భవిష్యత్తులో ఆర్మూర్‌కు తమ వంతు సేవలు అందించాలని వారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుశేఖర్ రోటరీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పట్వారి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, కాంతి గంగారెడ్డి, పద్మ మురళి, చరణ్‌రెడ్డి, పుష్పకరావు, లింబాద్రిగౌడ్, శశిధర్ వినాయక్, రాము తదితరులు పాల్గొన్నారు.

దళిత ఐక్య సంఘటన ఆధ్వర్యంలో..

దళిత ఐక్య సంఘటన డివిజన్ నాయకులు జంగం అశోక్ ఆధ్వర్యంలో వైద్యులు మధు శేఖర్‌ను మంగళవారం సన్మానించారు. కోటేశ్వరరావు, గుమ్మడి చంద్రయ్య, కుమారస్వామి, పింజ భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా వైద్యాధికారి సుదర్శనం



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో

నవతెలంగాణ-ఆర్మూర్

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి సుదర్శనం అన్నారు. ఆరోగ్య కేంద్రంలోని ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. 126 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు 16 మంది మహిళల రక్త నమూనాలు సేకరించారు. వీరందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి మహిళ ఆరోగ్య పరీక్షల నిమిత్తం సమీప ఆరోగ్య కేంద్రంలో రోజు పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందాలని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ మానస ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో బిగాల పూజలు



ఆలయం వద్ద ఎమ్మెల్యే తదితరులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా వినాయక్‌నగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఆకుల సుజాత శ్రీశైలం, కార్పొరేటర్ ఉమారని శ్రీనివాస్, నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తానాకుర్దులో కోతుల బెడద

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానాకుర్దు గ్రామంలో కోతులు బెడద రోజురోజుకు ఎక్కువవుతోంది. మంగళవారం స్కూలుకు వెళ్లిన విద్యార్థులు మధ్యాహ్నం ఇంటికి వచ్చే సమయంలో ఆ పాఠశాల బస్సు దిగగానే నలుగురు విద్యార్థులపై దాడి చేసేందుకు యత్నించాయి. పిల్లలు పరిగెత్తడం, అక్కడున్న కొందరు యువకులు వాటిని వెంబడించడంతో పెనుప్రమాదం తప్పింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రూరల్ ఎమ్మెల్యేను కలిసిన పలువురు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు రూరల్ ఎమ్మెల్యేకు బాజిరెడ్డి గోవర్ధన్‌కు మూడోసారి టికెట్ వచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ.. మంగళవారం హైదరాబాద్ వెళ్లి శాలువాతో సత్కరించారు. వచ్చే ఎలక్షన్లో బాజిరెడ్డి గోవర్ధన్‌ను దాదాపు 70 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించుకుంటామని జెడ్పీటిసి కమల నరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లతా కన్నీరం, సర్పంచులు సామముత్యం రెడ్డి, భరత్, కోల గంగాధర్, సాయరెడ్డి, ఎంపీటీసీలు ముత్తన్న రమేష్, నాయకులకు కెంపు భూమయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని మందర్న గ్రామంలో మంగళవారం సర్పంచ్ రావుబా గంగాధర్ విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, రాగి జావా, ఉచితంగా పుస్తకాలు, దుస్తులను అందిస్తుందని అన్నారు. ప్రతి కుటుంబంలోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేఖ, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ జ్ఞానేశ్వర్, సీఆర్పీ స్వర్ణలత, ఉపాధ్యాయులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో కర్ణాటక ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఏర్గట్ల

ఎమ్మెల్యే ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బాల్కొండ నియోజకవర్గానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కర్ణాటక రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే జొల్లే శశికళ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లికార్జున్ రెడ్డి మంగళవారం ఏర్గట్ల మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదటగా ఏర్గట్లలో ఏర్పాటు చేసిన మండలస్థాయి సమావేశంలో మాట్లాడారు. అనంతరం మహిళలతో కలిసి సహా పంక్తి భోజనం చేశారు. గుమ్మిర్యాల్ సర్పంచ్ సోమ రాజారెడ్డి, ఎంపీటీసీ బొల్లి శంకర్ నివాసాల్లో వారిని కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దోళ్ళ గంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్కన్న గారి మోహన్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి ర్యాడ రవీంధర్, ఓబీసీ రాష్ట్ర నాయకులు డమంకర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య చికిత్స



పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య చికిత్సను మంగళవారం నిర్వహించారు. చాలామంది వృద్ధులకు సరైన సమయంలో గ్రామీణ ప్రాంతాలలో సరైన చికిత్స అందడం లేదని, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య చికిత్సలు అందించినట్టు తెలిపారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు సైతం అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాగుల సుజాత, ఉపసర్పంచ్ సాంబయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఏఎన్ఎం పుష్ప తదితరులు పాల్గొన్నారు.